# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 తేది.20.9.2014

మహిళలు, బాలికల బద్రత, రక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం చేయడానికి ఏర్పాటైన కమిటీ శనివారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు మధ్యంతర నివేదిక అందజేశారు. సెప్టెంబర్ 2న పూనం మాలకొండయ్య నేతృత్వంలో ఏర్పాటైన ఏడుగురు సభ్యుల కమిటీ వివిధ శాఖల అధికారులతో, వర్గాలతో సంప్రదించింది. ఎన్‌జిఓలు, స్వయం సహాయక బృందాలు, టీచర్లు, విద్యార్థులు, ఐటి ఉద్యోగులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, మీడియాలో పనిచేస్తున్నవారు, సాధారణ గృహిణుల నుండి అభిప్రాయాలు సేకరించింది. గుజరాత్, కేరళ రాష్ట్రాల్లో కూడా పర్యటించి అక్కడి ప్రభుత్వాలు మహిళల కోసం చేసిన చట్టాలు, కార్యక్రమాలను అధ్యయనం చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తక్షణం అమలు చేయడం కోసం 77 ప్రతిపాదనలు చేసింది. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి చట్ట సభ సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతామని కమిటీ ఛైర్మన్ పూనం మాలకొండయ్య తెలిపారు. కమిటీ సభ్యులు శైలజా రామయ్యర్, సౌమ్యా మిశ్రా, స్వాతి లక్డా, స్మితా సబర్వాల్, చారుసిన్హా, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

''మహిళల బద్రతకే మొదటి ప్రాధాన్యం- కేసిఆర్''

తెలంగాణ రాష్ట్రంలో మహిళల బద్రతకే అత్యంత ప్రాధాన్యతనిస్తామని, అదే తమ ప్రభుత్వానికి కీలకాంశమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. మహిళల సమస్యలు- పరిష్కార మార్గాలపై శనివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అధ్యయన కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదికపై చర్చించారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగితే ఎట్టి పరిస్థితుల్లోను క్షమించవద్దని, అత్యంత

కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరిపితే ప్రభుత్వం కఠినంగా వుంటుందని భయం పుట్టేలా వ్యవహరించాలన్నారు. మహిళా ఉద్యోగులపై ఏదైనా తప్పు జరిగితే సంబంధిత శాఖాధిపతులే బాధ్యత వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కూడా ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మహిళల కోసం లంచ్ రూమ్స్, టాయిలెట్లు తప్పని సరిగా వుండాలన్నారు. ప్రస్తుతం వున్న చట్టాలను కఠినంగా అమలు చేయాలని, అవసరమైతే కొత్త చట్టాలు తీసుకురావాలని కేసిఆర్ చెప్పారు. పోలీసుల్లో 33 శాతం మంది మహిళలే వుండే అంశాన్ని పరిశీలించాలన్నారు. మహిళల పట్ల సమాజంలో మార్పు రావాలని చెప్పారు. పాఠ్యాంశాల్లో ఇందుకు సంబంధించిన అవగాహన తెచ్చే పాఠ్యాంశాలు రావాలని చెప్పారు. సినిమాలు, టివిలలో మహిళలను అవమానించే, అసభ్యంగా చూపించే దృశ్యాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవలసి వుందన్నారు. మహిళలను గౌరవించేలా, వారిలో ఆత్మ విశ్వాసం పెంచే సినిమాలు, టివి సీరియళ్లకు ప్రభుత్వం అవార్డులు, ప్రోత్సహాకాలు అందించాలని చెప్పారు. ప్రతి శాఖలో మహిళల కోసం గ్రేవియన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర స్థాయిలో కూడా గ్రేవియెన్స్ సెల్ పనిచేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. పాఠశాల స్థాయి నుండి అమ్మాయిలకు దాడులను తిప్పి కొట్టగలిగేలా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. బస్సుల్లో అమ్మాయిలు ఒకే వైపు వుండే విధంగా మధ్యలో గ్రిల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అమ్మాయిల తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించే కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. మహిళల బద్రత కోసం ఏ దేశంలో ఉత్తమమైన కార్యక్రమాలు అమలవుతున్నాయో తెలుసుకోవడానికి ఆయా దేశాల్లో పర్యటించాలని ముఖ్యమంత్రి సభ్యులకు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల బద్రత, రక్షణ కోసం ''మిషన్ ఉమెన్ ప్రొటక్షన్'' అనే పేరుతో కార్యక్రమాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళ బద్రతకు సంబంధించిన అంశాలపై ప్రస్తుతం

వున్న స్థితి గతులపై ప్రశ్నావళిని రూపొందించుకోవాలని, వాటికి సమాధానాలు వెతుక్కునే క్రమంలోనే మంచి కార్యక్రమాలు రూపొందించాలన్నారు. రాష్ట్రంలో గృహ హింస ఏ ఏ కారణాలతో ఎక్కువగా జరుగుతున్నాయనే విషయాలను విశ్లేషించి, ఆ అనుభవాల ద్వారా పరిష్కార మార్గాలు అన్వేషించాలన్నారు. ఈవ్ టీజింగ్, యాసిడ్ దాడులలాంటి బహిరంగ హింసాత్మక సంఘటనలకు కూడా కారణాలను అన్వేషించాలని, నిరోధక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. మహిళలు ఎక్కువగా చూసే టివి చానళ్లలో మహిళల బధ్రత కోసం చేసే చట్టాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు రూపొందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సింగపూర్‌లో ఎట్లయితే మహిళలు అర్ధరాత్రి దాటినా స్వేచ్ఛగా బయట తిరగగలరో తెలంగాణ రాష్ట్రంలో కూడా అలాంటి రోజులు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేకంగా ఒక భవనం నిర్మిస్తామని, నిర్వహణకు అవసరమైన నిధులు సమకూరుస్తామని ముఖ్యమంత్రి హామినిచ్చారు.

ఈ సమావేశంలో డిప్యూటి స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, గొంగడి సునీత, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు పూనం మాలకొండయ్య, సౌమ్యా మిశ్రా, శైలజా రామయ్యర్ స్వాతి లక్డా, స్మితా సబర్వాల్, చారుసిన్హా, తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం